క్లుప్తంగా

నేడు నియోజకవర్గ స్థాయి వైఎస్సార్ సీపీ సమావేశం

సామర్లకోట: నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం బుధవారం ఉదయం పెద్దాపురం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్టు నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు మంగళవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు జరిగే సమావేశంలో పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ మిధున్‌రెడ్డి, ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీపీలు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు.

నేడు గోర్సలో గడపగడపకూ

కొత్తపల్లి: గోర్స గ్రామంలో బుధవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్ మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే పెండెం దొరబాబు హాజరై గత నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వం అందించిన పథకాలపై ప్రచారం చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమం ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందన్నారు.

పారదర్శకంగా ఇంటర్వ్యూలు



అంగన్‌వాడీ ఆయా పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఆర్డీఓ రామారావు

పెద్దాపురం: సబ్ డివిజన్ పరిధిలోని ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో అంగన్‌వాడీ ఆయా వర్కర్ల పోస్టులకు ఇంటర్వ్యూలు పారదర్శకంగా నిర్వహిస్తున్నట్టు ఆర్డీఓ జేఎస్ రామారావు అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం తుని, శంఖవరం, ప్రత్తిపాడు, పెద్దాపురం ప్రాజెక్టుల పరిధిలోని ఆయా పోస్టుల నియామకాలకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇన్‌చార్జి పీడీ దుర్గాదేవి, ఏరియా ఆసుపత్రి పీపీ యూనిట్ వైద్యులు ఎస్.సుదీప్తి, సీడీపీఓలు ఉష, పద్మావతి, పూర్ణిమ, నాగలక్ష్మి తదితరులున్నారు.

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్తు



కొండెవరంలో నిర్వహిస్తున్న జగనన్నే మాభవిష్యత్తు కార్యక్రమం

కొత్తపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం సోమవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీలు, ఉప సర్పంచ్‌లు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతో కలిసి ఇంటింటా పర్యటించి పథకాలను వివరించి, మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు. కొండెవరంలో కన్వీనరు గాది గంగాబాబు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం చేపట్టారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సచివాలయ కార్యదర్శి మృతికి సంతాపం



సచివాలయ కార్యదర్శి షాహిద్దీన్

పెద్దాపురం: ఇటీవల రాజమహేంద్రవరం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన స్థానిక ఒకటో వార్డు సచివాలయ కార్యదర్శి షాహిద్దీన్‌కు పలువురు సంతాపం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ఉన్న ఆయన రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందారు. ఈ మేరకు మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, కౌన్సిలర్లు సంతాపం వ్యక్తం చేశారు.

అన్నదాతకు మద్దతు ధరే ధ్యేయం

కరప: అన్నదాత కష్టానికి మద్దతు ధర అందించడమే ధ్యేయంగా సీఎం జగన్ పనిచేస్తున్నారని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన జేసీ ఇలక్కియతో కలిసి ప్రారంభించారు. దళారులను, రైసు మిల్లర్లను ఆశ్రయించి రైతు మోసపోకూడదనే సీఎం జగన్ ఆర్బీకేలు, వాటిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. అలాగే బొండాలు రకాన్నిన మద్దతు ధరకు కొనుగోలు చేసేలా కేంద్ర ప్రభుత్వంతో సీఎం జగన్ సంప్రదిస్తున్నట్టు తెలిపారు. జేసీ ఇలక్కియ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రబీపంట కొనుగోలు చేసేందుకు 215 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నామన్నారు. బుధవారం నుంచి జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్టు ఆమె తెలిపారు. మద్దతు ధర కంటే తక్కువకు అడిగితే 1902, లేదా 155251 టోల్‌ఫ్రీ నంబర్లకు కానీ, జిల్లా కంట్రోల్ రూమ్ నంబరు 8886903611కు ఫోన్‌చేయాలన్నారు. జిల్లా పౌరసరఫరాలశాఖ డీఎం డి.పుష్పమణి తదితర అధికారులు పాల్గొన్నారు.

వడదెబ్బ జరభద్రం..!

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- గ్రామాల బాట పట్టిన వైద్య సిబ్బంది
- ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ
- జాగ్రత్తలు పాటించాలంటూ ప్రచారం

పిఠాపురం: రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఎండల వల్ల కలిగే సమస్యలు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. వాటిని ఎదుర్కొడానికి ప్రజలను అప్రమత్తం చేయడంలో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఏప్రిల్‌లో ఎండలు మండుతున్నాయి రోహిణీ కార్తె ఇంకా రాకుండే ఎండల తీవ్రత పెరిగింది. రానున్న వారం రోజుల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో వడదెబ్బ తగలడంతో పాటు సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. అందుకే ఆరోగ్య శాఖ అధికారులకు ఆదేశాల మేరకు వైద్య సిబ్బంది గ్రామాల బాట పట్టారు. ఎండల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నారు. వేసవి ప్రతాపంతో డీహైడ్రేషన్‌కు గురయ్యే పరిస్థితుల్లో పనులు చేసే ఉపాధి కూలీలకు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించి జాగ్రత్తలు వివరిస్తున్నారు.

చేయకూడనివి

- తీవ్ర ఉష్ణోగ్రతలు ఉండే సమయంలో ఎక్కువగా బయట తిరగకూడదు.
- రోడ్ల పక్క విక్రయించే చల్లని రంగుల పానీయాలు, ఆహారం తినకూడదు.
- మాంసాహారం తగ్గించాలి, తాజా కాయకూరలు ఎక్కువగా తీసుకోవాలి. మద్యం సేవించరాదు.

చేయవలసినవి

- నీళ్లు, పళ్ల రసాలు కొబ్బరి నీళ్లు, మజ్జిగ వంటి ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి.
- నలుపు, మందంగా ఉండే వాటికి బదులు లేత రంగుల్లో లభించే తేలికైన కాటన్ దుస్తులను ధరించాలి.
- రోజు కనీసం 15 గ్లాసుల నీళ్లు తాగాలి. పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి.
- ఆహారం తక్కువ మోతాదులో ఎక్కువ సార్లు తీసుకోవాలి.
- ఎండ వేళ ఇంటి పట్టునే ఉండాలి, బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ వంటివి వాడాలి.
- ఇంట్లో కటికీలు తెరచి ఉంచుకోవాలి.

వడదెబ్బ లక్షణాలు

చెమట పట్టక పోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, వణుకు పుట్టడం, మగత నిద్ర, కలవరింతలు, ఫిట్స్, పాక్షికంగా అపస్మారక స్థిలోకి వెళ్లడం.

వడదెబ్బకు గురైతే..

- ఎవరైనా వడదెబ్బకు గురైతే వెంటనే చల్లని ప్రదేశానికి తీసుకెళ్లాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థితికి వచ్చే వరకూ చల్లటి నీటిలో ముంచిన గుడ్డతో శరీరమంతా తుడవాలి. చల్లని గాలి తగిలే ఏర్పాటు చేయాలి.
- ఉప్పు కలిపిన మజ్జిగ, చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజ్, ఓరల్‌డీహైడ్రేషన్ ద్రావణం(ఓఆర్ఎస్)లు పట్టించాలి.
- పిల్లలు, గర్భిణులు, వృద్ధులు ఎండాకాలంలో మరింత శ్రద్ధ తీసుకోవాలి.
- వడదెబ్బ తగిలి అపస్మారకస్థితిలో ఉన్న రోగికి వెంటనే నీరు తాగించకూడదు, వీలైనంత త్వరగా దగ్గరలోని ఆస్పత్రికి తరలించి వెంటనే వైద్య సేవలు అందించేలా చూసుకోవాలి.



గొల్లప్రోలు మండలం కొడవలిలో ఓఆర్ఎస్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

అవగాహన కల్పిస్తున్నాం



వేసవిలో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాం. ఇప్పటికే గొల్లప్రోలు మండలంలో పలు గ్రామాల్లో సచివాలయాలు, రోగ్య ఉపకేంద్రాల ద్వారా ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బందితో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఓఆర్ఎస్ క్యాంపెయిన్స్ నిర్వహించడంతో పాటు ప్రతి గ్రామంలోను ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాం. ఆరోగ్య సిబ్బందిని అప్రమత్తం చేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం. ముఖ్యంగా ఎండలో పని చేసే వారిపై నిఘా పెట్టి వారికి ఏ అవసరం వచ్చినా వెంటనే చర్యలు తీసుకుంటున్నాం.

–అహ్మద్ భాషా, హెల్త్ సూపర్‌వైజర్, గొల్లప్రోలు

స్ఫూర్తి ప్రదాత మహాత్మా జ్యోతిరావు పూలే

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- జ్యోతిరావు పూలేకు ఘన నివాళులు



జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు



సామర్లకోట రైతు భవనంలో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు



పూలే చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నేతలు



మున్సిపల్ కార్యాలయంలో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చైర్మన్, వైస్‌చైర్మన్లు

కొత్తపల్లి: స్ఫూర్తి ప్రదాత మహాత్మా జ్యోతిరావు పూలే అని, యవత ఆయన మార్గాన్ని అనుసరించాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. గోర్స గ్రామంలో జ్యోతిరావు పూలే చిత్ర పటానికి పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గా ఆయన మాట్లాడుతూపేదల జీవితాల్లో వెలుగుల కోసం పోరాటాలు చేసి మహా వ్యక్తి అని కొనియాడారు ఈ కార్యక్రమంలో సర్పంచి రొంగల వీరబాబు, జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, కోఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, కొత్తపల్లి మండల, పిఠాపురం పట్టణ సచివాలయాల పార్టీ కన్వీనర్‌లు ఉమ్మిడి జాన్, బాలిపల్లి రాంబాబు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బలహీనవర్గాల ఆశాజ్యోతి పూలే : దవులూరి

సామర్లకోట: స్థానిక గాంధీచౌక్‌లోని రైతు భవనంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. వారి పోరాట స్ఫూర్తితో సీఎం వైఎస్ జగన్ పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. వారి లాగే కులాల మధ్య అంతరాన్ని తగ్గించేందుకు సీఎం కృషి చేస్తున్నారన్నారు. అయ్యరక కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, పెద్దాపురం మున్సిపల్ వైస్‌చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, పెద్దాపురం జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ సీఎంఎ నయీం అహ్మద్, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు నివాళులు అర్పించారు. మున్సిపల్ కార్యాలయంలోని జ్యోతిరావు పూలే విగ్రహానికి ఎమ్మెల్యే రాజప్ప నివాళులు అర్పించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ డి.శ్రీలలిత అధ్యక్షతన ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మండల స్థాయి అధికారులు పూలేకు నివాళులు అర్పించారు.

పేదల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే

పిఠాపురం: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే అని, ఆయన మార్గంలో యువత నడవాలని పిఠాపురం మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు వైఎస్సార్ సీపీ నేత గండేపల్లి బాబీ అన్నారు. పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు కార్యాలయంలో మంగళవారం పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పచ్చిమళ్ల అప్పలరాజు, బాలిపల్లి రాంబాబు, బొజ్జా రామయ్య, పెదపాటి నాగేశ్వరరావు, చింతాడ నీలవేణి, చెల్లూరి లోవరాజు, బండి రవి. తదితరులు పాల్గొన్నారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో పూలే జయంతిని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్‌వీవీ సత్యనారాయణ పూలే చిత్ర పటానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పూలే ఆశయసాధనకు కృషిచేయాలి

పెద్దాపురం: మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్‌లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కమిషనర్ జంపా సురేంద్ర అధ్యక్షతన జరిగిన సభలో వక్తలు మాట్లాడుతూ స్త్రీ విద్యకు బాటలు వేసి, అణగారిన వర్గాల ఆశాజ్యోతిగా సేవలందించిన ఆదర్శప్రాయుడు పూలే అన్నారు. టీపీఓ ఉమా మహేశ్వరరావు, కౌన్సిలర్లు త్సలికి సత్య భాస్కర్, ఆరెళ్ళి వీర్రాఘవులు, కట్టా రాజుబాబు, కో–ఆప్షన్ సభ్యులు షేక్ రఫీ, వైఎస్సార్ సీపీ నాయకులు ముమ్మన ప్రకాష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, మండల ఉపాధ్యక్షులు మిరియాల రాజాలు ఇన్‌ఛార్జి ఎంపీడీఓ కరక హిమమహేశ్వరి ఆధ్వర్యంలో పూలేకు నివాళులర్పించారు. కార్యాలయ పరిపాలనాధికారి శ్రీనివాస్, సీనియర్ సహాయకులు జగన్నాథం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే స్థానిక వరహాలయ్యపేటలోని యాసలపు సూర్యారావు భవనంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నీలపాల సూరిబాబు అధ్యక్షతన ఐద్వా కన్వీనర్ కూనిరెడ్డి అరుణ పూలే చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో దారపురెడ్డి సత్యనారాయణ, కేదారి నాగు తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌డీ కోసం టెండర్ల ఆహ్వానం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలా త్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయానికి చెందిన నిధులు బ్యాంకులలో డిపాజిట్ చేయడానికి ఎక్కువ వడ్డీ ఇచ్చే విషయమై టెండర్లు నిర్వహిస్తున్నట్టు ఈఓడి నాగమల్లేశ్వరరావు, ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబులు తెలిపారు. మంగళవారం సాయంత్రం వారు విలేకర్లతో మాట్లాడుతూ ఆలయానికి చెందిన సర్వే నెంబరు 126/2లోని పల్లపు భూమి మూడు ఎకరాల 58 సెంట్లు జాతీయ రహదారి నిర్మాణం నిమిత్తం తీసుకున్నారని, దీని నిమిత్తం ప్రభుత్వం నుంచి రూ.2,37,06,510 దేవస్థానానికి చెల్లించినట్టు తెలిపారు. ఈ భూమి స్థానంలో మరో భూమి కొనుగోలు చేసే వరకు బ్యాంకుల్లో ఎఫ్‌డీఆర్ చేయడానికి నిర్ణయించడం జరిగిందన్నారు. ఎక్కువ వడ్డీ ఇచ్చే జాతీయ బ్యాంకుల్లో డిపాజిట్లు చేయడానికి ఈ నెల 19వ తేదీ వరకు టెండర్లు స్వీకరించి అదే రోజు మధ్యాహ్నం ఒంటి గంటకు తెరవడం జరుగుతుందన్నారు.

కొనసాగుతున్న ఆపద మిత్రల శిక్షణ

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో ఐదు జిల్లాలోని ఆపద మిత్రలకు ఇస్తున్న శిక్షణ మంగళవారం కొనసాగింది. కేఎస్ఎన్ రెడ్డి, కె.నిహారిక, పి.శ్రీనివాసరావు, బి.అంజనేయులు శిక్షణ నిర్వహించారు. 23వ తేదీ వరకు శిక్షణ కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

గిరీష్‌బాబు కుటుంబానికి న్యాయం చేయాలి

సామర్లకోట: స్థానిక బలుసులపేటకు చెందిన ఆలపు గిరిష్‌బాబు కుటుంబానికి న్యాయం చేయాలని మాజీ ఎంపీ హర్షకుమార్ డిమాండ్ చేశారు. గిరిష్‌బాబు స్వగృహం వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఎస్సీ కమిషన్ ఏర్పాటు చేసినా ఎటువంటి ప్రయోజనం కనిపించలేదన్నారు. దళిత సంఘ నాయకులు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేర్చిన ఘనత జగన్‌దే



గోర్సలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

- ఎమ్మెల్యే దొరబాబు
- గోర్సలో గడపగడపకూ మన ప్రభుత్వం

కొత్తపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వనివి కూడా నెరవేర్చి పేదల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకుని చరిత్రలో నిలిచారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. గోర్స గ్రామంలో జరిగిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్ళి నాలుగేళ్లలో ప్రతి గడప పొందిన లబ్ధిని వివరించారు. అనంతరం ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కారే సుధ, జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, గ్రామ సర్పంచి రొంగల వీరబాబు, ఎంపీటీసీ కొండపల్లి సూర్య నాగేశ్వరావు, వైస్ ఎంపీపీలు మాదిరెడ్డి దొరబాబు, చెట్టుబత్తిన సురేష్‌కుమార్, కోఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, పార్టీ సచివాలయాల మండల కన్వీనర్ ఉమ్మిడి జాన్, మండల వ్యవసాయ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు, ఎస్సీ, ఎస్టీ డివిజన్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బండి దావీదు, నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నూకాలమ్మ ఆలయంలో సామూహిక పూజలు



ఆలయంలో సామూహిక పూజలు చేస్తున్న మహిళలు

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లోని నూకాలమ్మ తల్లి ఆలయంలో మంగళవారం సామూహిక పూజలు చేశారు. కొత్త అమావాస్య పూజల సందర్భంగా పిఠాపురానికి చెందిన సంగీత కళాకారుడు ఆకొండి వెంకట్రావు ఆధ్వర్యంలో సుందరకాండ పారాయణ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త వల్లూరి బుల్లియ్య ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ నాయకులు, పారాయణ కమిటీ నాయకులు యార్లగడ్డ శ్రీను, పెనుమర్తి సత్యనారాయణ, గోలి రాంబాబు, మార్ని శ్రీనివాసు, మద్దుకూరి జోగారావు, పేకేటి చిరంజీవి, మాజేటి కృష్ణ, సత్తి అరుణ భక్తులకు సేవలందించారు.

మహిళా సాధికారతే లక్ష్యంగా జగన్ పాలన

- అచ్చంపేటలో 200వ రోజు గడప గడపకూ విజయోత్సవం
- రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు



అచ్చంపేటలో గడప గడపకూ మన ప్రభుత్వంలో లబ్ధిదారులను కలుసుకున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: మహిళా సాధికారిత లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మంగళవారం అచ్చంపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం 200వ రోజు విజయోత్సవాన్ని నిర్వహించారు. భారీ బాణసంచా నడుమ గ్రామ నాయకులు కేక్ కట్టింగ్ చేసి పంచారు. దొరబాబు మాట్లాడుతూ ఇప్పటి వరకు సుమారు 64 వేల గడపలు తిరిగానని, ప్రతి ఇంటి వద్ద అపూర్వ స్వాగతం లభించిందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలతో తామంతా మేలు పొందామని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నట్టు తెలిపారు. తనకు ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేసే అవకాశం కల్పించారని, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని, జగన్‌ను సుదీర్ఘ కాలం ముఖ్యమంత్రిగా ఉండేలా చూసుకునే బాధ్యత మనపై ఉందని ఆయన అన్నారు. అనంతరం సొసైటీ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని, ఎంపీటీసీ వింటి కృష్ణ ఆధ్వర్యంలో గడప గడపకూ తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించి వారి మద్దతు కోరారు. అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంపీడీఓ డి.శ్రీలలిత, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి తలారి దొరబాబు, పెద్దాపురం వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, చేనేత సంఘ రాష్ట్ర నాయకుడు ముప్పన వీర్రాజు, పెద్దాపురం జెడ్పీటీసీ గరవసాని సూరిబాబు, మండల ఉపాధ్యక్షులు ములసా శ్రీను, పేర్నిడి వెంకట్రాయుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మోరంపూడి రమేష్, సొసైటీ అధ్యక్షులు ఉటా వాసు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



అచ్చంపేట గ్రామంలో 200 రోజును పురస్కరించుకుని కేక్ కట్ చేసిన దవులూరి దొరబాబు

ఊపందుకున్న వరి కోతలు, మాసూళ్లు



రహదారిపై యంత్రాలతో కోసిన ధాన్యం రాశులను ఆరబెట్టుకుంటున్న రైతులు



ధాన్యంను ఎడ్ల బళ్లపై మిల్లులకు తరలిస్తున్న రైతులు

పిఠాపురం: వాతావరణం అనుకూలించింది. పంటలు చేతికందే పరిస్థితి కలిసొచ్చింది. రైతులు రబీ పంటల ఒబ్బిడి పనుల్లో ఉన్నారు. రబీ కోతలు ఊపందుకున్నాయి కోత కోసిన ధాన్యం ఇంటికి చేర్చుకునే పనిలో రైతులు బిజీఅయ్యారు. పిఠాపురం నియోజకవర్గంలో 80 శాతం పంటలు కోత దశకు చేరుకోవడంతో యంత్రాలతో పనులు చేపడుతున్నారు. వరి పంట తేమ తగ్గించడానికి కళ్లాల్లో కొన్ని రోజులు ఆరబెడుతున్నారు. గత వారం రోజులుగా కోతలు ప్రారంభం కాగా ఇప్పటి వరకు సుమారు 30 శాతం పూరయ్యాయి. గత రెండు రోజుల నుంచి కోతలు మరింత ముమ్మరం చేశారు. ఎక్కువగా వరి కోతలు యంత్రాలతోనే చేపట్టారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండడంతో మరో రెండు మూడు రోజుల్లో మరో 40 శాతం కోతలు పూర్తవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల సిబ్బంది పొలాల్లోకి వెళ్లి కోత పూర్తయిన పంటలు విక్రయాలకు సంబంధించి రైతులకు సూచనలు ఇస్తున్నారు. ప్రస్తుతం దిగుబడులు ఆశాజనకంగానే ఉన్నాయని ఈనెలాఖరుకు వరి కోతలు వంద శాతం పూర్తవుతాయని పిఠాపురం వ్యవసాయ శాఖ ఏడీఏ స్వాతి తెలిపారు.